క్లుప్తంగా

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం



పసుపు కొడుతున్న మహిళలు

భీమవరం (ప్రకాశంచౌక్): దేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్ వెనుక శ్రీవరసిద్ధి వినాయక, శ్రీభవాని దుర్గా మల్లేశ్వర స్వామివార్ల ఆలయంలో పసుపు కొట్టే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సెప్టెంబర్ నెలాఖరు నుంచి దసరా వరకు అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త సభ్యులు, ఆలయ అర్చకులు తెలిపారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ

ఆకివీడు : మండలంలోని దుంపగడప గ్రామంలో గల వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. జీవిత బీమా సంస్థ ఆర్థిక సహకారంతో దీనిని చేపడుతున్నారు. ఉప సభాపతి కె.రఘురామకృష్ణరాజు, కలెక్టర్ సీహెచ్ నాగరాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత, సర్పంచ్ ఎం.విశ్వేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న ముత్యాల రత్నం

ఆకివీడు: స్థానిక రూరల్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ముత్యాల వెంకటేశ్వరరావు(రత్నం) సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొన్నేళ్లుగా రూరల్ బ్యాంక్ చైర్మన్‌గా కొనసాగుతూ, డీసీసీబీ, ఆప్కాబ్ వైస్‌చైర్మన్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రైతుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆయనతో పాటు సభ్యులుగా మద్రివాడ వెంకట్రావు, ఊడిగ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

నరసాపురం రూరల్: రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం జక్కంపూడి నాగభూషణం నాయుడు, ఇతర సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించగా అధిక సంఖ్యలో రక్తదాతలు ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ రక్తం అవసరమై అపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ సంస్థ ఇటువంటి క్యాంపులను నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: అనారోగ్య బాదితుడికి వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. సోమవా రం పోడూరు గ్రా మానికి చెందిన ఆర్.నాగవెంకట రామకృష్ణకు కాలుకు గాయమై కాలును తొలగించారని అతడికి వైద్య ఖర్చుల నిమిత్తం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు అందించిన రూ.10 వేల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించినట్లు ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు తెలిపారు.

గ్రామ దేవతల ఉత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు గ్రామ దేవత దండు మారెమ్మ, పేట మారమ్మ అమ్మవార్ల జాతరను పురస్కరించుకొని నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఖండవల్లి వారిచే నిర్వహించిన జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ నెల 17న ప్రారంభమైన ఉత్సవాలు 21వ తేదీ వరకూ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ అర్చకులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైతులను ఆదుకోవడంలో చంద్రబాబు విఫలం

పెంటపాడు: సీఎం చంద్రబాబుకు రైతును ఆదుకోవాలనే జిజ్ఞాస లేకపోవడం విడ్డూరమని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన పెంటపాడు మండలంలో తుపాను బాధిత గ్రామాలైన పెంటపాడు, కె.పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ల, పడమరవిప్పర్రు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గత వారం క్రితం కురిసిన వర్షం వల్ల మునిగిపోయి, కుళ్లిపోయిన నీటి మూనలను రైతులు చూపారు. ఆధునీకరణ లేకపోవడం వల్ల ముంపు సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన రైతును విస్మరించడం తగదన్నారు. ఈ విషయంపై జగనన్న నుంచి చంద్రబాబు ఎంతో నేర్చుకోవాలన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

నీటమునిగిన వరినాట్లు



స్థానిక మాదివాడలో ముంపునకు గురైన వరి చేలు



సమతానగర్ రోడ్డులో ముంపు బారిన పడనున్న వీరమల్లు నగర్ కాలనీ

ఆకివీడు: గత నాలుగు రోజులు కురుస్తున్న వర్షాలకు వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు చోట్ల రోడ్లు అధ్వానంగా మారాయి. పంట కాల్వలు, మురుగు కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. వరి చేలల్లో అడుగులోతు నీరు ప్రవేశించింది. కొల్లేరు తీర గ్రామాలు, ఉప్పుటేరు తీర ప్రాంతాల్లోని పొలాల్లో రెండగుగుల నీరు నిలబడి ఉంది. నాట్లు వేసిన వారం, పది రోజులకే వరి చేలు చాలా చోట్ల ముంపునకు గురయ్యాయి. నియోజకవర్గంలో సుమారు 300 ఎకరాల పంట నీట మునిగింది.

ఎగువ నుంచి భారీగా ముంపునీరు

నియోజకవర్గంలోని పలు పంట కాల్వలు, మురుగు కాల్వల్లోకి ఎగువ ప్రాంతం నుంచి ముంపు నీరు చొచ్చుకొచ్చి గట్లను తాకుతూ ప్రవహిస్తోంది. ముంపునీటితో కాల్వలకు గండ్లు పడే అవకాశ ఉందని రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నుంచి నిడదవోలు కాలువ మీదుగా వెంకయ్య వయ్యేరు, గోస్తనీ నదుల గుండా అదనపు నీరు చొచ్చుకువచ్చి పలు మండలాల్లోని పంట పొలాల్ని ముంచెత్తుతోంది. బొండాడ డ్రెయిన్, ఆలకోడు, తుమ్మకోడు, నక్కల కాలువ, కొల్లేరు ఛానల్, చినకాపవరం పంట కాల్వ, చినకాపవరం డ్రెయిన్లతో పాటు నియోజకవర్గంలోని పలు డ్రెయిన్లు, పంట కాల్వల్లో అధికంగా నీరు ప్రవహిస్తోంది. వీటికి తోడు పలు చోట్ల చెరువుల్లోని నీటిని కాలువల్లోకి వదిలివేయడంతో కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉంది.

మరో మూడు రోజులు భారీ వర్షాలు

బంగాళాఖాతంలో మరో రెండు అల్పపీడనాలు ఏర్పడే అవకాశం ఉందని, మరో మూడు రోజులు భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. గంటకు 30–40 కిలోమీటర్ల వేగంతో తీరం వెంబడి ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉందన్నారు. కొల్లేరు, ఉప్పుటేరు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి వరద ఉధృతి దృష్ట్యా పంట కాల్వలు, డ్రెయిన్లలోకి అధిక శాతం నీరు ప్రవేశించే ప్రమాదం ఉందన్నారు. గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొల్లేరు సరస్సులోకి ముంపు నీరు అధికంగా వచ్చే అవకాశం ఉందని తహసీల్దార్ చెప్పారు. దీని ప్రభావం వల్ల తీరగ్రామాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందన్నారు.

పోలేరమ్మకు కిరీటం సమర్పణ



సీసలిలో పోలేరమ్మకు కిరీటం అలంకరిస్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని సీసలిలో వేంచేసియున్న గ్రామదేవత శ్రీపోలేరమ్మ అమ్మవారికి భక్తులు బహూకరించిన రెండున్నర కేజీల బరువుగల ఇత్తడితో (సుమారు రూ.25 వేలు) చేసిన కిరీటాన్ని సోమవారం అలంకరించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామ పెద్దలు చేతుల మీదుగా అమ్మవారికి అలంకరించారు. పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ అమ్మవారి ఆలయం అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ముంపునకు గురైన చేలలో జాగ్రత్తలు పాటించండి

ఉండి: భారీ వర్షాలకు ముంపునకు గురైన వరిచేల విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని ఉండి, ఉప్పులూరు, ఎన్నార్పీ అగ్రహారం, కోలమూరు గ్రామాల్లో ఏఓ పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఊడ్చిన దశ, పిలకలు వేసే దశలో ఉన్న వరిచేలు నీట మునిగాయన్నారు. మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటీయూ 1318, సంపద స్వర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలు ఐదు రోజులపాటు ముంపును తట్టుకుంటాయని తెలిపారు. వరి మొక్కలు చనిపోయిన యెడల మనే దలు వేసుకోవాలని సూచించారు. అలాగే ఎద పద్ధతిలో విత్తిన పొలం నీటమునిగితే వీలైనంత త్వరగా వరిచేనులోని నీటిని బయటకు తీసి ఆరబెట్టాలన్నారు. పిలకల దశలో మునిగితే సాధారణ రకాలు ఐదు రోజులపాటు ముంపును తట్టుకునే ఎంటీయూ 1064, పీఎల్‌ఏ 1100 వంటి రకాలు వారం రోజులు మునకను తట్టుకుంటాయని తెలిపారు. ఆకులు పైకి కనిపిస్తూ 30–40 సెం.మీ నీరు నిలబడితే పల్లపు ప్రాంతాల్లోని ముంపును తట్టుకుంటాయని తెలిపారు. అదే ఎంటీయూ 1232 రకం అయితే 10–12 రోజులు తాత్కాలిక ముంపును తట్టుకుంటాయని తెలిపారు. పిలకలు కట్టే దశలో నీట మునిగితే వరి పొలం త్వరగా పుంజుకోవడానికి నీటిని తీసివేసి ఎకరాకు 20 కి.యూరియా, 10–15 కి. పొటాష్ అదనంగా వేసుకోవాలని ఏఓ సూచించారు.



ఉప్పులూరులో వరిచేలను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు: మండలంలోని కోళ్లపర్రు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు చర్యల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కోళ్లపర్రు, చెరుకువాడ ప్రాంతాల్లోని ఆక్వా రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు మైక్‌ల బహూకరణ

ఆకివీడు: స్థానిక పులవర్తి లక్ష్మణస్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు రూ.25 వేల విలువైన వస్తువుల్ని సోమవారం పాఠశాలకు బహూకరించారు. రెండు వైర్‌లెస్ మైక్‌లు, ఆమ్లిఫైయిర్‌లను పూర్వవిద్యార్థులు, స్థానిక నగర పంచాయతీ కౌన్సిలర్ దొడ్డి జగదీష్, బొడ్డుపల్లి రాంబాబు, ఫణి, తదితరులు ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు.

వరిచేల ముంపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఉండి: డ్రెయిన్‌లలో చెత్తా చెదారం తొలగించకపోవడంతోనే మండలంలోని వరిచేలు ముంపునకు గురవుతున్నాయని యండగండి గ్రామానికి చెందిన పీవీఎస్ గోపాలకృష్ణంరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. డ్రెయినేజీ అధికారులు, ప్రాజెక్టు కమిటీ నాయకుల నిర్లక్ష్యంతో చెత్తా చెదారం తొలగించే పనులు తీవ్రంగా జాప్యమవుతున్నాయని అన్నారు. యండగండి మీడియం డ్రెయిన్‌లోను తూడు, గుర్రపుడెక్క విపరీతంగా ఉందని దీనివల్ల నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదన్నారు. అందుకే ఈ ప్రాంతంలో ముంపు తీవ్రంగా ఉంటుందని తెలిపారు. డ్రెయినేజీ అధికారులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీల వారు జాప్యం చేయకుండా చెత్తాచెదారం తొలగించే కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు

ఆకివీడు: దుంపగడప గ్రామంలో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై అందిన ఫిర్యాదు మేరకు రెండు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై సత్యనారాయణ సోమవారం తెలిపారు. పాత గొడవల నేపథ్యంలో రాడ్డులు, కర్రలతో దాడి చేసుకోగా ఇరువర్గాలకు గాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా చికిత్స చేసి కొందరిని పంపించగా, ఇద్దరిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొట్టు సాయి, చెకటి మోహన్ పవన్ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై వివరించారు.

ఆశ వర్కర్ల వేతనాలు పెంచాలి



వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్న ఆశ వర్కర్లు

వీరవాసరం: ఆశ వర్కర్లకు వేతనాల సమస్యను పరిష్కరించకుండా.. వయోపరిమితి, ప్రసూతి సెలవులు, గ్రాట్యూటీ వంటివి ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఆశ వర్కర్స్ యూనియన్ వీరవాసరం ఏరియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యవసర సరుకులు ధరలు, కరెంటు చార్జీలు వంటి అనేక భారాలు పెరిగిపోవడంతో వేతనాలు పెంచాలని ఆశ వర్కర్లు పలు దశల్లో ఆందోళన చేశారని అన్నారు. వేతనాల పెంపు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల, వెంకటలక్ష్మి, సుబ్బలక్ష్మి, శ్యామల తదితరులు మాట్లాడారు.

ఆక్వా రంగాన్ని ఆదుకోండి

ఉండి: ట్రంప్ టారీఫ్‌లతో కుదేలైన ఆక్వా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి ఆకుల హరేరామ్ డిమాండ్ చేశారు. దీనిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆక్వారైతులను ప్రభుత్వం ఆదుకోవాలంటూ ఈ నెల 21వ తేదీన ఉండి ఏఎంసీలో నిర్వహించే సమావేశానికి ఆక్వారైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మన రాష్ట్రంలో ఐదు లక్షలకు పైగా ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతుందని, దీనిలో అధికంగా సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉన్నారని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలతో వీరంతా అయోమయంలో ఉన్నారని, ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం నుంచి బయటపడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు జీను ఆదినారాయణ, నక్కా వెంకటేశ్వర్లు, గండికోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

బార్ లైసెన్సులకు దరఖాస్తుల స్వీకరణ

పాలకొల్లు సెంట్రల్: నూతన బార్ పాలసీ మూడు సంవత్సరాలకు లెసెన్సులు పొందుటకుగాను ఓపెన్ కేటగిరిలో ఆరు బార్లకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఒక్కో అప్లికేషన్‌కు రూ.5 లక్షలు దరఖాస్తు రుసుము, రూ.10 వేలు అప్లికేషన్ రుసుము చెల్లించాలన్నారు. డ్రాలో బార్ దక్కించుకున్న వారికి ఓపెన్ కేటగిరి బార్‌కి సంవత్సరం రుసుముగా రూ.55 లక్షలు నిర్ణయించినట్లు తెలిపారు. నూతన పాలసీ విధానం ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ బార్లకు టైమింగ్ నిర్ణయించబడిందని తెలిపారు. బార్ లైసెన్స్ ఫీజులు ఆరు వాయిదాల్లో చెల్లించాలన్నారు. పాలకొల్లు అర్బన్ పరిధిలో గీత కులాల (గౌడ) వారికి ఒక బార్ రిజర్వ్ చేయబడినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ స్టేషన్ వద్ద తెలుసుకోవచ్చన్నారు.

తణుకు అర్బన్: నూతన బార్ పాలసీ విధానానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తణుకు ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 6 బార్లకుగాను ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అందచేయవచ్చని అన్నారు. లైసెన్స్ ఫీజు మొదటి ఏడాది రిటైల్ ఎక్సైజ్ టాక్స్ రూ. 55 లక్షలు చెల్లించాలని ఏడాదికి పది శాతం పెంచి మరో రెండేళ్లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో లాటరీ ప్రక్రియ ద్వారా ఈనెల 28న బార్‌లను ఎంపిక చేస్తారని చెప్పారు. ప్రతి దరఖాస్తుకు రూ. 5 లక్షలు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజుగాను, రూ. 10వేలు నాన్ రీఫెండబుల్ ప్రాసెసింగ్ ఫీజుగా నిర్దేశించినట్లు వివరించారు.

ఘనంగా పాపన్న గౌడ్ జయంతి

పాలకోడేరు: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను సోమవారం పాలకోడేరులో స్థానిక గౌడ సంఘ అధ్యక్షుడు కారింకి సాయిబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే బహుజనులందరినీ ఏకతాటిపై తీసుకువచ్చి కుల మత వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు అంగర సుబ్బారావు, అత్తిలి వెంకటేశ్వరరావు పండు, అధ్యక్షుడు కారింకి సాయిబాబు, కారింకి వెంకట సత్యనారాయణ డాక్టర్ విగ్రహదాత మాన్యం తేజ గౌడ్, కార్యదర్శి బెజవాడ సుబ్బారావు, యర్రింకి సురేష్ స్వామి, కారింకి రామకృష్ణ, కట్టా చంటి తదితరులు పాల్గొన్నారు.



పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం

పెన్షన్ మార్చ్ ర్యాలీని జయప్రదం చేయాలి

నరసాపురం: పాత పెన్షన్ విధానం కోరుతూ ఏపీసీపీఎస్‌ఈఏ సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన గుంటూరు నాగార్జున యూనివర్సిటీ నుంచి విజయవాడ వరకు చేసే పెన్షన్ మార్చ్ ర్యాలీని ఉద్యోగులు జయప్రదం చేయాలని గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం డెమోక్రటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసెఫ్ కిషోర్, నరసాపురం మండల కమిటీ అధ్యక్షుడు పి.మదన్‌మోహన్ కోరారు. సోమవారం స్థానిక చలువ పేటలోని అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పెన్షన్ ఉద్యోగి హక్కని, ప్రభుత్వాలు హామీలు ఇవ్వటమే కాదు వాటిని అమలు చేయాలని కోరారు. పెన్షన్ మార్చ్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

భీమవరం: పట్టణంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు ఓరిగంటి సుందరి మెరిటోరియల్ యాన్యువల్ మెరిట్ స్కాలర్‌షిను ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున కళాశాల పూర్వ విద్యార్థి ఓరిగంటి భరత్ సోమవారం అందించారు. చదువులో రాణిస్తున్న ఈసీఈ విద్యార్థిని కె ప్రవళిక, ఏఐఎంఎల్ బ్రాంచ్ విద్యార్థిని ఎం.ఈశ్వరికి కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు చేతుల మీదుగా స్కాలర్‌షిప్ చెక్కులు అందించారు. కార్యక్రమంలో కళాశాల అలుమిని అసోసియేషన్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వీకే విశ్వనాథరాజు, ఈసీఈ హెడ్ ఎస్ ఉదయ్‌కుమార్, సీఎస్సీ హెడ్ బీహెచ్‌వీ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌కేఆర్‌లో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న దృశ్యం

'విష్ణు'లో విద్యార్థులకు శిక్షణ

భీమవరం: స్థానిక విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో వీఎల్ఎస్ఐ అండ్ లేఔట్ ఫండమెంటల్స్ విత్ కాడెన్స్ విర్చుసోసో అనే అంశంపై వారం రోజులపాటు నిర్వహించే హ్యాండ్స్–ఆన్ శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని చెన్నైలోని ఎపికల్ లేఔట్స్, బెంగళూరుకు చెందిన సి డాక్ ఈడీఏ టూల్ మద్దతుతో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మంగం వేణు చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక ఎలక్ట్రానిక్స్‌లో వీఎల్ఎస్ఐ టెక్నాలజీ ప్రాముఖ్యత, సెమీకండక్టర్ పరిశ్రమలో నైపుణ్యం కలిగిన నిపుణులపై పెరుగుతున్న డిమాండ్‌ను వివరించారు. చైన్నైకు చెందిన సీనియర్ లేఔట్ ఇంజినీర్లు జగదీష్‌బాబు, మోహనరాజ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం శ్రీలక్ష్మి, ఎం.దిలీప్, ఎస్.పద్మావతి, బీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

తీరప్రాంతంలో నాణ్యమైన విద్యనందించాలి

నరసాపురం: తీర ప్రాంతం ప్రజలకు నాణ్యమైన విద్యను అందించాలని కేంద్ర భారీ ఉక్కు గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం మొగల్తూరు మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామంలో గొన్నాబత్తుల వెంకట ప్రసాద్, నందిని విద్యారణ్య భారతీయ విద్యా కేంద్రం ఇంగ్లిష్ మీడియం సీబీఎస్ఈ సిలబస్ నూతన భవనం ప్రారంభ కార్యక్రమంలో మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యారణ్య ఆవరణలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి, వినాయక విగ్రహాలకు పూల మాలలు వేసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం 2.30 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 10 కోట్ల వ్యయంతో నిర్మించిన 30 తరగతి గదుల స్కూల్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ గొన్నుబత్తుల వెంకటప్రసాద్, నందిని దంపతులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులపై దాడులను అరికట్టాలి

పాలకొల్లు సెంట్రల్: జీవిత చరమాంకంలో తమకు అనేక వేధింపులు ఎదురవుతున్నాయని సీనియర్ సిటిజన్స్ పాలకొల్లు శాఖ కార్యదర్శి జీఎస్ఎన్ మూర్తి అన్నారు. సోమవారం సీనియర్ సిటిజన్స్ జాతీయ కోరికల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, పట్టణ పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాలు అందించారు. మూర్తి మాట్లాడుతూ అనారోగ్యాలతో జీవిత చరమాంకంలో ముఖ్యంగా ఒంటరిగా ఉంటున్న వయో వృద్ధులపై రోజు రోజుకూ వేధింపులు, దోపిడీలు, మోసాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. వృద్ధుల ప్రాణ, మాన, ఆస్తి సంరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.